# ఎర్రమల్లె

తెల్లగా చిరుపాపల్లా నిద్రపోతున్న మల్లె మొగ్గల్ని కుప్పచేసి దండ గుచ్చుతుంటే, సన్నటి సూది, చేప పిల్లలా జారి 'కసుక్కు-న' వేలు కరిచింది. సూది గుచ్చుకున్న చోట ఉబికిన కండ, దానిమీద కొంచెం కొంచెం పెద్ద దవుతున్న రక్త బిందువుని తుడిచి 'అయ్యో!' అనుకోటానికి మనసు రాలేదు. 'నా కేమీ తెలియదన్నట్లు' కొసకి నెత్తురు పూసుకుని కన్పించీ కన్పించకుండా నేలమీద పడింది సూది. పెరిగి పెరిగి పెద్దదై, కుంకం బొట్టంతై, మధ్యాహ్న సూర్యుడంతైన నెత్తుటి చుక్క-ని తుడిచి వేయలేక పోతోంది.

ఆ రంగు తనకు ప్రాణం. అది తన శరీరపు రంగు, తనలో ప్రవహించే జీవప్రవాహపు రంగు, ఆ రంగు తాలూకు చిహ్నాలు కూడా తనని నిషేధించి దూరం చేసినా తనని విడిచి పెట్టని రంగు, ఆ రాక్షసత్వానికి బలి అయిన తనకు ప్రతినిధిగా నిలిచిన ఆ వర్ణంమీద తనకు జాలి — మమత, లోకంలోని ఏ వస్తువుమీద లేని అనురాగం — గుండె పిండి ఆ రంగుకి నైవేద్యం చేద్దామని కోరిక, కార్చే కన్నీరు ఆ రంగులో కార్చి ఋణం తీర్చుకుందామనే ఆకాంక్ష.

బిందువుగా నిలిచిన రక్తాన్ని గోటితో కల్యాణ తిలకంగా దిద్దుతోంది — సరిదిద్దుతోంది. జలతారు కాంతులు చిమ్ముతూ వాయు వేగాన్ని మించి పరుగులు పెట్టే జోడు గుర్రాల్లాంటి కళ్ళు పూన్చిన విశాలమైన ఫాల భాగ

స్యందనం మీద ఠీవిగా స్వారీ చేసే సౌందర్య రూపమైన కల్యాణ తిలకానికి వన్నెలు తీరుస్తోంది. తను చేయని నేర ఫలంగా వచ్చిన శిక్షకి, కర్మపేరుతో జరిగిన అఘాయిత్యానికి ఫలించని తన అదృష్టానికి, తన నుంచి లాగివేయబడ్డ మూల ధనానికి ఫలితంగా, స్వామిలేని దేవాలయంగా పువ్వు కోయ బడి మిగిలిన తొడిమలా, పేలవంగా, కళాహీనంగా, తెల్లని తెల్లకాగితంలా ఉన్న తన ముఖం చూడటం శుభప్రదం కాదని తొలగిపోయే లోకానికి తెలియకుండా, చాటుగా, మొగిలి పొదల నీడన, ప్రకృతి ఇచ్చిన అభయముద్ర మాటున గుండె పులకలెత్తగా అందాలు అనుభవిస్తోంది.

కల్యాణ తిలకానికి కొసలుతీర్చి రూపమిచ్చింది. మహా సౌందర్యం నిగ్గులుతీరి నిల్చున్నట్లుగా ఉన్న ఆ రూపాన్ని చూసి నిశ్చేష్టురాలయింది. ఒకనాడు లీలగా కొన్ని క్షణాల పాటు తన ముఖంమీద మెరిసి, తనలో జీవకళ నింపి, తన అందానికి పరిపూర్ణత నిచ్చి శాశ్వతంగా అంతర్ధానమైంది.

కల్యాణ తిలకంగా రూపొందిన రక్తం కదిలిపోయి రూపం మార్చుకుంటోంది—చెమటకు చెదిరిన కుంకుంబొట్టులా చెరిగిన తన భాగ్యరేఖలా చెరిగిపోతున్న కల్యాణతిలకాన్ని చూస్తుంటే మనసు విలవిలలాడ్తోంది. ఆలస్యం చేయకుండా వేలుని గట్టిగా కనుబొమ్మలమధ్య ఒత్తుకుని నుదుటిమీద తిలకం నిల్పుకుంది. కొలనులోకి వంగి చూసుకుంది. తన ముఖం తను ఎన్నడూ చూసుకోని అందాలముఖం. ఆ ముఖంలో మన్మథబాణంలా నిలిచిన కల్యాణ తిలకం, తనను సర్వమంగ ళగా శుభప్రదగా నిల్పగలిగే మహత్తరమైన వస్తువు నుదుటి మీద వెలిగిపోతోంది.

కాంతులు వెలార్చే ఈ ముఖంతో అందరికీ స్వాగతం చెప్తుంది. సుఖాలకు ఆనందాలకు ఆటపట్టవుతుంది. శాంతికి సహృదయతకు వాకిళ్ళు తెరుస్తుంది. తన స్వామి పాదాలకు వంగి వందనంచేస్తుంది. నుదుటిమీద కల్యాణతిలకం లీలగా ఆ పాదాల కంటుకుంటుంది. అది ఆనందాల నిధిగా, శాశ్వత మంగళ ప్రదాయినిగా భాసిస్తుంది. తలెత్తి స్వామివైపు ఆనందంగా చూస్తుంది. స్వామి నీలిమబ్బులవంటి చేతుల్తో లేవనెత్తి తనని అక్కునచేర్చి లాలిస్తాడు. తను సిగ్గుల బరినై ఆ కౌగిలిలో ఒదిగి పోతుంది.

కొలనులో నీళ్ళు గాలికి జల జల కదిలాయి. కల తొలగి పోయింది. కదలుతున్న నీళ్ళలో తన నుదుటి మీది తిలకం నాట్యం చేస్తోంది. తన మనసు ఆనందంతో ఊగిస లాడుతూ గాలికంటె తేలికై తేలి పోతోంది. తన ముఖంలో సిగ్గు దొంతరలు తనే చూడలేక చరాలున ముఖం మళ్లె పొదలవైపు తిప్పుకుంది.

సంపంగి వాసనలు పరుగెత్తుకొచ్చి గిలిగింతలు పెట్టాయి. జాజి మొగ్గలు సంతోషంగా తల లెగుర వేశాయి. వికసించిన గులాబీలు గుండె నిండుగా నవ్వి ఆనందించాయి. ఇంతటి సంతోషాన్ని తట్టుకోలేక తూలి పోతోంది. తల వాల్చేసు కుంది.

దండ కట్టని మల్లెపూలు బిక్క మొహం పెట్టి పలక రించాయి. ఇప్పటిదాకా వాటి సంగతే మర్చిపోయినందుకు నొచ్చుకుని దండ గుచ్చటం మొదలెట్టింది.

ఆకాశాన పెద్ద మబ్బు పక్కనే ఒక చిన్ని మబ్బు నడిచి వెళ్తోంది. ఆ చిన్న మబ్బు లేకపోతే ఆ మేఘానికి అంత

అందం లేదనుకుంది. చెట్టు మీద పిట్టల జంట ముక్కులు రాసుకుంటూ రెక్కలు దువ్వుకుంటున్నాయి. ఆడ పిట్టకి కోపమొచ్చి కాబోలు దూరంగా జరిగి వెళ్లటం చూసి తనలో తను నవ్వుకుంది.

ఈనాడు తన మనసు సంతోషంతో నిండి పోయింది. తన ముఖంమీద కల్యాణ తిలకం దీపంలా వెలుగుతోంది. మల్లె దండ సిగలో తురుముకుని తన ఆనందాన్ని అపారం చెయ్యాలి. నల్లటి ఆకాశంలాంటి కురుల్లో కుప్పపోసిన నక్షత్రాల్లా, తన సౌందర్యాన్ని శ్లాఘించే కావ్యంలో అక్షరాల్లా వెలగాలి. ఇంతటి మహదానందాన్ని పొందబోయే గుండె ఆత్రంగా కొట్టుకుంది. రక్తం వేగంగా ప్రవహించింది. తను సూది గబగబా ఆడించింది.

మల్లె దండ తల్లో పెట్టుకోబోయింది. అక్కడ మల్లె పూలు లేవు. తెల్లటి మల్లెలు నెత్తురు పులుముకుని ఎర్రటి పూలయ్యాయి. కొన్ని వందల సూదిపోట్లు తిన్న చెయ్యి రక్తం చిమ్ముతోంది. గుండె నీరైంది. ఆకాశం వైపు చూసింది. అక్కడ పెద్దమబ్బులో చిన్నమబ్బు కలసిపోయింది. పిట్ట లెక్కడికో ఎగిరిపోతే చెట్టు బోసిపోయింది. కొలను నీళ్ళలో తన ముఖంమీద కల్యాణతిలకం జారిపోయి కన్నీళ్ళలో కలిసిపోవటం కన్పించింది. ఎర్రగా నిప్పుకణాల్లో ఉన్న మల్లె పూలను పిచ్చిగా తలమీద పోసుకుంది. ప్రవహిస్తున్న రక్తాన్ని ముఖమంతా పులుముకుంది.

నీళ్ళలో ఏవో నీడలు కదిలాయి, రేగిన కార్చిచ్చులా, ముక్కంటి మంటలా, విలయాగ్ని కీలలా—